**కథానిక**

# మంచి నడత గల కుక్క

కవన శర్మ

అందమైన బంగళాలో ఉన్న షెడ్డులోంచి డ్రైవరు అందమైన కారు బయటికి తీసాడు. ఆ కారుకున్న తెరలు, డ్రైవరు భార్య పెళ్ళిళ్ళకి, పేరంటాలకి వెళ్ళేటప్పుడు కట్టుకొనే మంచి చీర కంటే కూడా చక్కగా, నాజూకుగా ఉన్నాయి. కారుని బయటికి తీసాక మరోసారి దాన్ని తుడిచాడు. నిగనిగలాడ్తున్న కారు మరింత నిగనిగలాడింది. సీట్లు మరోసారి దులిపాడు. కారుని అల్లా దులిపి తుడిచి, డ్రైవరు తృప్తి పడ్డాడు. ఆ కారులో ఏ మాత్రం దుమ్మున్నా మాసిపోయే అంత అందంగా, తెల్లగా ఉంటుంది, ఆ యింటి యజమానురాలు సుజాత. ఆమె బట్టలు టినోపాల్ ఎడ్వర్‌టైజ్‌మెంటులాగా తెల్లగాను, అప్పుడే కురిసిన మంచు అంత పరిశుభ్రంగాను ఉంటాయి.

సుజాతకి పరిశుభ్రత మీద వెర్రి వ్యామోహం ఉంది. అది పాటించేందుకు కావల్సిన డబ్బు, తీరుబడి ఉన్నాయి. భర్తకి పెద్ద కంపెనీ ఉద్యోగం ఉంది, ఆ కంపెనీ వాళ్ళిచ్చే పెద్ద బంగళాని అందంగా; శుభ్రంగా ఉంచుకోగలందులకు ఆ కంపెనీ ఇచ్చిన నౌకర్లున్నారు.

ఆ రోజు సుజాత అందంగా తయారై అందమైన కార్లో బయల్దేరుతున్నది, ఆ నౌకర్లలో ఒకడైన నర్సింపులింటికి. నర్సింపులింటికి సుజాత బయల్దేరిందంటే దానికో పెద్ద, ముఖ్యమైన కారణం ఉంది. ఆ కారణం పేరు జేన్. జేన్, సుజాత ప్రాణంగా పెంచుకొంటున్న కుక్క.

జేన్ మంచి అలవాట్లున్న కుక్క. ఆ మంచి అలవాట్లు సుజాత నేర్పించింది. సుజాతకున్న యిద్దరు పిల్లలు మంచి నడవడి నేర్పే ఖరీదైన స్కూళ్ళలో దూరంగా ఉన్న ఊళ్ళలో చదువుకొంటున్నారు. సుజాతకు పిల్లలు తన దగ్గరుండి చదువుకునే రోజుల్లోనే తోచేది గాదు. పిల్లలు దూరంగా ఉండటంతో తనకి తోచడం లేదన్న విషయం ధైర్యంగా అందరికీ చెప్పుకొని సానుభూతి సంపాదించింది.

అందరు తలా కొంచెం సానుభూతి, తలకొక సలహా ఇచ్చారు. అందులో సుజాతకి నచ్చిన సలహా, విశ్వాసపాత్రమైన కుక్కని పెంచడం. కుక్కలు పిల్లల కంటె ఎక్కువ ఆపేక్ష చూపిస్తాయని సుజాత అందరూ అనుకోగా వింది. అందుకని ఒక ప్రైవేటు ప్రాక్టీస్ చేస్తున్న డాక్టర్‌గారి దగ్గర కొన్ని వందలు పోసి జేన్‌ని కొంది. అమ్మిన డాక్టరు ఆ కుక్కపిల్లకి మంచి అలవాట్లు ఎల్లా నేర్పాలో సుజాతకి బోధపర్చాడు. కుక్కల యజమానులైన స్నేహితులు కొందరు పొద్దున్నే కుక్కని అల్లా వీధిలో తిప్పుకొని వస్తే, యిల్లు గలీజు

చెయ్యదని స్వానుభవంతో చెప్పారు. సుజాత ఆ డ్యూటీ నర్సింహులకి వేసింది. నర్సింహులా బంగళాలో నౌకరు.

రోజూ జేన్‌ని అల్లా బయట తిప్పి తీసుకొని వచ్చే నర్సింహులా రోజు రాలేదు. జేన్ కాలు కాలిన పిల్లిలాగా, బయటకు పోవాల్సిన కుక్కలాగా ఇల్లంతా తెగ తిరిగింది. సుజాతకి దాని బాధ అర్ధమైంది. అర్ధమై డ్రైవరు రాగానే దాన్ని అల్లా తిప్పి తీసుకు రమ్మంది. జేన్‌కి డ్రైవర్ని చూస్తే వెళ్లాలనిపించే షికారు వేరు. ఆ షికారుకి సుజాతతో, కారు వెనక సీట్లో నిలబడి మెడ కిటికీ లోంచి కొంచెం బయటికి పెట్టి ఠీవిగా వెళ్తుంది. అందుకని డ్రైవరు పటకా పుచ్చుకొని రమ్మని లాగినా అది కద ల్లేదు సరికదా ఏసుక్కున్నట్టుగా మొరి గింది. పోనీ కారులోనే దూరంగా వెళ్తుం దను కొంటే సుజాత లేకుండా వెళ్లను గాక వెళ్లనంది. జేన్ అలవాట్లు అలాం టివి మరి. డ్రైవర్తో వెళ్తే యజమానురాలి తోడు లేనిదే వెళ్లదు. అలవాటైన చోటికి వెళ్తేగాని అవుసరాలు తీర్చుకోదు.

సుజాత జేన్ నడతకి, క్రమశిక్షణకి తెలివితేటలకి మురిసిపోయింది.

జేన్, కారు డ్రైవరు వెనక తలుపు తెరచి పట్టుకోగానే మెత్తగ పరుగెత్తి అందమైన జూలు కళ్లమీద పడ్తుండగా ఎగిరి సీట్లో నిలబడింది. మళ్లీ కార్లోకి ఎగిరింది. ఎగిరే ముందు తనని షికారు అవమని సుజాతని బతిమాలింది. సుజాత దాని తెలివితేటలకి మరోసారి మురిసిపోయి కారు నాజూకుగా ఎక్కింది. డ్రైవరు శబ్దం కాకుండాతలుపు వేసాడు.

కారు రెండు ఫర్లాంగుల దూరంలో ఉన్న నర్సింహులింటికి దూసుకు పోయింది.

సరిగ్గా ఆ సమయంలో నర్సింహులు పెళ్ళాంఅయిదేళ్లకూతుర్ని కేకలేస్తోంది. "ఏంటంటావ్? ఉన్నది ఒక్కటే దొడ్డి. ఆగలేకపోతే రోడ్డు పక్కగా ఎళ్లు ఎంతమంది ఎళ్తున్నారుగారూ? నువ్వేం దొర్సానివా? లోపలగాని యెళ్ల నంటావా? అయ్యొచ్చే వరకు అగు. లోపలి కెళ్లిన మనిషిని కాసేపు నిదా నంగా కూర్చోనీయకపోతే ఎల్లా? "

ఆ చిన్నది తల్లి కేకకి దడుసుకొని సిగ్గును జయించి వీధిలోకి నడిచింది గౌను పైకి పట్టుకొని. సరిగ్గా అదే సమయాని ఎదురింటి చిన్ని, పక్కింటి కిష్టుడు, అక్కడే ఉన్నారు కూర్చుని. నర్సింహులి కూతురు వాళ్ల పక్కన జేరింది.

సుజత కారు ఆ వీధిలోకి వచ్చింది. వీధిలో పారుతున్న మురుగు కాలవ నుంచివచ్చే దుర్గంధం ముక్కులు బద్దలు చేస్తోంది. వీధిలో బారులు తీర్చికూర్చున్న పిల్లల్ని చూచి, వీళ్లకంటే జేన్ నయం అను కొంది. నేర్పితే కుక్కకైనా మంచి నడత వస్తుంది కదా! మరి మనుష్యు లెందుకు నేర్పరో వాళ్ల పిల్లలికి! బహుశః వాళ్లకే మంచిఅలవాట్లు ఉండి ఉండవు. వాళ్లేం నేర్పుతారు!

డ్రైవరు కారుని నర్సింహు లింటి ముందు ఆపి నర్సింహుల్ని పిలిచాడు. నర్సింహులి కూతురులేచి అయ్యని పిలవ డానికి లోపలకి పోయింది. వచ్చింది. సాక్షాత్తు యజమానురాలు కావటంతో నర్సివుల భార్య లోపలున్న భర్తను

పిలవక తప్పలేదు. నర్సింవులు బయటకు వచ్చి సంగతి తెలుసుకొని వీధిలోకి వచ్చాడు. సుజాత "ఇవాళ ఎందుకు రాలేదు? జేన్ పొద్దున్న నుంచి నీకోసం ఎదురు చూస్తోంది" అంది కోపంగా.

"ఇయ్యాల కొంచెం కడుపులో నొప్పిగా ఉంది. బేదులవుతున్నాయ్యండమ్మగారు!" అని మనవి చేసుకొన్నాడు నర్సింవులు. అతడిని చూస్తూనే కార్లోనికుక్క బయటికిదిగింది నర్సింవులు దాని వెంట నడిచాడు.

అది చిన్ని, కిష్టుడు కూర్చున్న చోటకి పోయి గొయ్యి తవ్వి తన పని కానిచ్చి తీవిగా వెనక్కి వచ్చింది. నర్సింవులు అమ్మగారు కుక్కని బయటకు తీసుగు పొమ్మనప్పుడల్లా తన యింటి కేసి తీసుకు పోయి తన పెళ్లాం పిల్లల్ని పలకరించి వస్తాడు. జేన్‌కి అందుకని నర్సింవులింటి దగ్గర కాల కృత్యాలు తీర్చు కొనే అలవాటైంది. లేక సుజాత యింటికి దూరంగా పోయే మంచి అలవాటైంది:

పని ముగించు కొన్న జేన్ నర్సింవుల్ని నిర్లక్ష్యంగా చూసి కారెక్కింది. కారు బయల్దేరింది. సుజాత నర్సింవులింట పరిసరాల్ని వదలి వెళ్ళి "ఛీఛీ! ఏం మనుషులు" అనుకొంది.

తన యింటో మనిషికి రెండు బాత్రూమ్‌లుంటే ఇక్కడ పదిమంది కొకటే దొడ్డి ఉందని గాని, బంగళాలలోని మురికి నర్సింవుల లాంటి వాళ్లయిళ్ల ముందు యధేచ్ఛగా పార్తుందని కాని, తనకంత పెద్ద పెరడున్నా ఓ మూల ఓ చిన్న గొయ్యి తీసి జేన్‌కి అక్కడ అలవాటు చెయ్యకుండా మంచి అలవాటు పేరుతో ఏదో ఒక వీధి పాడు చెయ్యడానికే ఆ కుక్కని నర్సింవుల్తో బయటకి పంపుతున్నానని గాని, తను కార్లో పోతుంటే లేచిన దుమ్ము నడుస్తున్న వాళ్ల మొహాన పడ్తోందని, కారు వదిలిన పొగ అందరు పీల్చే గాలిని పాడు చేస్తోందని గాని, తన సుఖంలో ఇతర కష్టం ఉందని, ఒకరి చోటు శుభ్రంగా ఉండాలంటే విధిగా మరొకరి చోటు అశుభ్రంగా ఉండి తీరాల్సి వస్తుందని, కొందరు బీదగా ఉంటేనే కొందరు ధనవంతులుగా ఉండ గలరని, మన మంచి బాగే, మరొకరి చెడు నాశనం కాగలదని, అదే ఈనాటి జీవన సూత్రం అని కాని సుజాతకి ఆలోచన రాలేదు.

నర్సింవులకి కూడా అమ్మగారి యింటిని, ఆ పరిసరాల్ని శుభ్రంగా ఉంచేందుకు అమ్మగారి కుక్క చేత తను తన యింటి పరిసరాలు పాడు చేయిస్తున్నానన్న గుర్తింపు లేదు. అ కుక్క తనమీద అధికారాన్ని చెలాయిస్తూ అమ్మగారి మీద అభిమానం ఒలక బోయటానికిగల కారణం అతనికి తెలియదు. తెలియదు కనుక బాధ పెట్టదు.

కాని ఇవన్నీ డ్రైవర్ని బాధ పెడ్తున్నాయి. డ్రైవరు కారు నడుపుతూ "ఆలోచిస్తున్నాడు" ఏ మోహిని ఏ పరమార్థం కోసం పక్షపాత బుద్ధితో ఆఫీసర్లకి శుభ్రతని, నౌకర్లకి మురికిని పంచి పెడ్తోంది?" అని.